

ఆటోడ్రైవర్లను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్టించుకోవాలంటూ.. తమ సంక్షేమం కోసం పనిచేయాలంటూ ఓ డ్రైవర్ ఆటో వెనకాల నినాదం రాసుకొని ప్రయాణిస్తున్న దృశ్యం


నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, శనివారం 22 ఫిబ్రవరి 2025 | HYDERABAD


## వెన్‌కాబ్ చికెన్, ఎన్‌ఈసీసీ ఆధ్వర్యంలో చికెన్ మేళా

సిటీ బ్యూరో, ఫిబ్రవరి21,(నమస్తే తెలంగాణ): వెన్‌కాబ్ చికెన్, జాతీయ కోడిగుడ్ల సమన్వయ సమితి ఆధ్వర్యంలో శుక్రవారంనాడు నగరంలోని చింతలకుంట, కార్వాన్, కర్మన్‌ఘాట్, మోండా మార్కెట్, చిలుక నగర్, ఉప్పల్ ప్రాంతాల్లో చికెన్, గుడ్ల మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా చికెన్ పై ప్రజల్లో నెలకొన్న అనుమాలను కొట్టిపారేస్తూ వండిన చికెన్, కోడి గుడ్లను ప్రజలకు అందించేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ 70 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత వద్ద ఎటువంటి బ్యాక్టీరియా అయినా, వైరస్ అయినా చనిపోతుందని వెల్లడించారు. అలాంటిది 100 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత వద్ద వండే చికెన్, గుడ్డులో ఎలాంటి బ్యాక్టీరియా లేదా వైరస్ ఉండే అవకాశం లేదన్నారు. ప్రజలు ఏవిధమైన అపోహలకు గురికాకుండా అత్యంత ప్రొటీన్స్ ఉండే గుడ్డు, చికెన్‌ను తినాలని నిర్వాహకులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేళాలో పెద్ద ఎత్తున మహిళలు, పిల్లలు, పెద్దలు పాల్గొన్నారు.

# మా పొట్ట కొట్టకండయ్యా!

మమ్మల్ని ఆగం చేయకండయ్యా!!

### గోడు వెళ్ళబోసుకున్న చిరు వ్యాపారులు
### తమ వ్యాపారాలు తొలగించి
### బతుకులు రోడ్డు పాలుచేయొద్దంటూ
### ప్రభుత్వానికి పోలీసులకు మనవి



చిరు వ్యాపారులతో మాట్లాడుతున్న చిలకలగూడ ట్రాఫిక్ సిఐ శ్రీనివాసులు



చిరు వ్యాపారులకు మద్దతుగా మాట్లాడుతున్న కార్పొరేటర్ రాసూరి సునీత

అడ్డగుట్ట, ఫిబ్రవరి 21 : 'రోడ్డుమీద చిరు వ్యాపారాలను నిర్వహించుకుంటూ జీవితాలను సాగిస్తున్నాం.. మా వ్యాపారాలను తీసేసి మా బతుకులను రోడ్డుపాలు చేయకండయ్యా' అని కాంగ్రెస్ ప్రభుత్వానికి, పోలీసులకు మొరపెట్టుకుంటున్నారు నగర వీధి వ్యాపారులు. గత నాలుగు నెలలుగా పోలీసుల వేధింపుల వల్ల తాము రోడ్డు పక్కన చిన్న చిన్న వ్యాపారాలను చేసుకోలేక పోతున్నామని మెట్టుగూడ ప్రధాన రోడ్డుకు ఇరువైపులా చిరు వ్యాపారాలను నిర్వహించుకునేవారు నేషనల్ అసోసియేషన్ ఆఫ్ స్ట్రీట్ వెండర్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గోడు వెళ్లబోసుకున్నారు. శుక్రవారం మెట్టుగూడలో జరిగిన ఈ కార్యక్రమంలో మెట్టుగూడ – తార్నాక మీల్స్ ఫుడ్ వెండర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చింత రమేశ్ మాట్లాడుతూ.. గత 20 సంవత్సరాలుగా ఆలుగడ్డ బావి బస్‌స్టాప్ నుండి తార్నాక ఆఫీసర్స్ క్లబ్ వరకు ప్రధాన రోడ్డుకు ఇరువైపులా చిరు వ్యాపారాలను ఏర్పాటు చేసుకొని జీవనాన్ని సాగిస్తున్నామని వారు తెలిపారు. చిరు వ్యాపారాల జీవనోపాధి, క్రమబద్ధీకరణ చట్టం 2014లోని చాప్టర్ 2 లోని 3(3)ప్రకారం ఏ చిరు వ్యాపారిని కూడా తొలగించరాదని చట్టం స్పష్టంగా చెబుతుందున్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. 2014 ప్రకారం ఈ ప్రాంతంలో సర్వే చేసి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఫుడ్‌సేఫ్టీ అధికారులు తమకు గుర్తింపు కార్డులు, నైపుణ్య శిక్షణ కూడా ఇచ్చి ధ్రువపత్రాలు అందించినట్టు తెలియజేశారు.

### 20 ఏళ్ల నుంచి అక్కడే

మెట్టుగూడ ప్రధాన రహదారికి అటు ఇటూ 120 కి పైగా కుటుంబాలు 20 ఏళ్లకు పైగా చిరువ్యాపారాలు చేస్తున్నాయని చింత రమేశ్ వెల్లడించారు. నానాకష్టాలు పడీ ఏ రోజుకారోజు బతుకులను వెళ్లదీస్తుంటే అకస్మాత్తుగా పోలీసులొచ్చి తమ బండ్లను తొలగిస్తే బతికేదెలా? అని ప్రశ్నించారు. తమకు వ్యాపారం చేసుకునేందుకు జీహెచ్ఎంసీ అనుమతి కూడా ఇచ్చిందని కానీ పోలీసులు మాత్రం తమను బాగా ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 4 నెలలుగా వ్యాపారం లేకపోవడంతో ఫైనాన్స్ తీసుకున్న డబ్బులు చెల్లించలేక లలిత అనే చిరు వ్యాపారి ఒత్తిడి భరించలేక గుండెపోటుతో మరణించిందని చెప్పారు. ఇలా ప్రతి ఒక్కరూ ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. 4 నెలలుగా తమకు కుటుంబ పోషణ కష్టమవుతున్నదని, ఎటూ దిక్కుతోచని పరిస్థితుల్లో కుటుంబాలు బిక్కుబిక్కుమంటున్నాయని చెప్పారు.

### అండగా మేమున్నాం: మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత..

చిరు వ్యాపారులు ఏర్పాటు చేసుకున్న బండ్లను తొలగిస్తున్నారని సమాచారం అందుకున్న మెట్టుగూడ కార్పొరేటర్ రాచూరి సునీత అక్కడికి చేరుకొని చిరు వ్యాపారులకు మద్దతుగా నిలిచారు. 20 ఏళ్లుగా వ్యాపారాలను నిర్వహించుకుంటూ జీవనాన్ని సాగిస్తున్న వారిని వ్యాపారాలు ఏర్పాటు చేసుకోకుండా ఆటంకాలు సృష్టించడం సరైనది కాదని ఆమె స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి పేద ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నదని, ఇది సరైనది కాదని ఆమె అన్నారు. చిరు వ్యాపారులకు వ్యాపారాలను ఏర్పాటు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించే అంత వరకు తను స్ట్రీట్ వెండర్స్ వైపు పోరాటాన్ని సాగిస్తానని ఆమె ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. స్థానిక కాంగ్రెస్ నాయకుల ఒత్తిడితోనే ఇదంతా జరుగుతున్నదని, కక్ష సాధింపు రాజకీయాలు ఇకనైనా మానుకోవాలని ఆమె హితవు పలికారు.



### కుటుంబాన్ని ఎలా పోషించాలి

"వ్యాపారం చేసుకుంటే కానీ బతకలేని జీవితాలు మావి. 4 నెలలుగా వ్యాపారాలు బంద్ కావడంతో కుటుంబ నిర్వహణ కష్టమవుతున్నది. వ్యాపారాలను ఏర్పాటు చేసుకునే అవకాశాన్ని ఇవ్వండి అని ఎన్నిసార్లు ట్రాఫిక్ పోలీసులకు మొరపెట్టుకున్నా వారు పట్టించుకోవడం లేదు. ఎవరికీ ఇబ్బంది కలిగించకుండా వ్యాపారాలను నిర్వహించుకుంటామని స్పష్టంగా చెప్పిన వారు వినడం లేదు. **- దుర్గా, చిరు వ్యాపారి**



### రోడ్డు పక్కన వ్యాపారం తప్పా?

"వ్యాపారాలను నిర్వహించుకుంటేనే జీవితాలు సాఫీగా గడిచే బతుకులు మావి. అధికారులు దయతలిచి మాకు రోడ్డు పక్కన వ్యాపారాలను నిర్వహించుకునే అవకాశాన్ని కల్పించండి. మీకు జీవితాంతం మా కుటుంబాలు రుణపడి ఉంటాయి.

**- సరిత, చిరు వ్యాపారి**




వెన్‌కాబ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన చికెన్ మేళా

# డబుల్ బెడ్‌రూమ్ రాదు.. ఇందిరమ్మ ఇల్లు లేదు

### స్థలం కొంతమందికే ఉందనే సాకుతో నగరాన్ని పక్కకు పెట్టిన సర్కార్
### కట్టించి సిద్ధంగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇవ్వాలంటున్న ప్రజలు

సిటీ బ్యూరో, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): ఇంటి స్థలం కొంతమందికే ఉందన్న సాకుతో తొలి విడత ఇందిరమ్మ ఇండ్ల పంపిణీలో హైదరాబాద్‌ను కాంగ్రెస్ సర్కార్ పక్కకుపెట్టింది. కేసీఆర్ ప్రభుత్వం కట్టించిన లక్ష డబుల్ బెడ్ ఇండ్లలో ప్రజలకు పంపిణీ చేయగా ఇంకా దాదాపు 32 వేల డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నగరం నలుమూలలా ఉన్నాయి. వాటిని తమకు పంపిణీ చేయాలని పేద ప్రజలు కోరుతున్నారు. వాటిని పంచితే క్రెడిట్ అంతా కేసీఆర్‌కే వస్తుందనే అక్కసుతో నిరుపయోగంగా ఉంచుతూ నిరుపేదలను ఇబ్బందులకు గురి చేస్తున్నదని ఆవేదన చెంతున్నారు. నిర్మించి ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు సిద్ధంగా ఉండగా.. ఎందుకు పంచడం లేదని నిలదీస్తున్నారు.

### ఖరీదైన ప్రాంతాల్లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు

కేసీఆర్ ప్రభుత్వంలో పేద ప్రజలు ధీమాగా బతకాలనే దృఢ సంకల్పంతో వందలాది కోట్ల రూపాయల విలువైన ప్రాంతాల్లో సకల సదుపాయాలతో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించారు. హైదరాబాద్ విశ్వ నగరంగా విస్తరిస్తుండటంతో శివారు ప్రాంతాల్లోని భూముల ధరలు కోట్లలోకి చేరాయి. ఆ ప్రాంతాల్లోనే నిరుపేదలకు ఇండ్లు ఇవ్వాలని కేసీఆర్ సర్కార్ భావించింది. అందుకనుగుణంగా నగరం నలుమూలలా లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించారు. వాటిలో దాదాపు 68 వేల ఇండ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఇంకా సుమారు 32 వేల ఇండ్లు పంపిణీకి సిద్ధంగా ఉంచారు. కానీ వాటిని కాంగ్రెస్ సర్కార్ నిరుపయోగంగా ఉంచుతోంది. ఇందిరమ్మ ఇండ్ల పేరిట కొత్త పథకాన్ని తీసుకొచ్చి.. కోట్ల విలువైన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పక్కకు పెట్టిందని నిరుపేదలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### నిరుపేదలకు సొంత స్థలం ఎలా సాధ్యం?

శంకుస్థాపనలతో కాలయాపన చేసే బదులు సిద్ధంగా ఉన్న ఇండ్లను పంచితే నిరుపేదలకు ఉపయోగంగా ఉంటుందని అంటున్నారు. నగరంలో నివసించే పేదలకు సొంత స్థలం ఉండదనే అప్పటి కేసీఆర్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించింది. కానీ కాంగ్రెస్ సర్కార్ మాత్రం సొంత స్థలం ఉంటేనే ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని చెబుతున్నది. సొంత స్థలం ఉంటే పేదలమెలా అవుతామని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఇందిరమ్మ ఇండ్ల పేరిట మోసం చేయకుండా సిద్ధంగా ఉన్న ఇండ్లను పంచాలని కోరుతున్నారు. నగర ప్రజలను దరఖాస్తుల పేరిట ఇబ్బందులకు గురిచేయకుండా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ముందుగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు ఇప్పటికే ఎంపికైన వారికి పంపిణీ చేసి.. మిగిలిన వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని అభిప్రాయపడుతున్నారు.






## తాజ్‌బంజారా సీజ్

బంజారాహిల్స్: రెండేళ్లుగా ఆస్తి పన్ను బకాయి చెల్లించకపోవడంతో పాటు బల్దియా నోటీసులకు స్పందించకపోవడంతో బంజారా హిల్స్ రోడ్ నం.1లోని తాజ్‌బంజారా హోటల్‌ను అధికారులు సీజ్ చేశారు. సుమారు రూ.1.40 కోట్ల మేర బకాయి ఉండటంతో అనేక సార్లు నోటీసులు జారీ చేశారు. అయినా చెల్లించకపోవడంతో రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేశారు. అయితే తమ హోటల్ మరమ్మతులు జరుగుతున్నందున బకాయి చెల్లింపు కోసం మరింత గడువు ఇవ్వాలని యాజమాన్యం కోరింది. ఇందుకు నిబంధనలు అంగీకరించవన్న సర్కిల్ 18 అధికారులు.. హోటల్‌ను సీజ్ చేశారు.



## ఉప్పల్..తప్పని తిప్పల్

ఉప్పల్ నుంచి వరంగల్ ప్రధాన రహదారిలో ప్రయాణం చేసే వారికి తిప్పలు తప్పడం లేదు. కేంద్రప్రభుత్వం నిర్మించ తలపెట్టిన పై వంతెన పనులు నిలిచిపోవడంతో రోడ్లు ఇరుకుగా మారి.. ట్రాఫిక్ బాగా నెమ్మదించింది. ఈ పరిస్థితి నుంచి ఎప్పటికి బయటపడతామోనని ఉప్పల్ వాసులు నిత్యం పెదవి విరుస్తున్నారు.



యూసుఫ్‌గూడ సర్కిల్‌లో ఆస్తి పన్ను బకాయి ఉన్న ఒక ప్రైవేట్ స్కూల్‌ను సీజ్ చేసిన బల్దియా అధికారులు

# పన్ను కట్టలేదో.. సీజ్ చేస్తాం

### 6 లక్షల మందికి బల్దియా నోటీసులు.. ఆస్తిపన్ను బకాయిదారులను టార్గెట్ చేసిన జీహెచ్ఎంసీ
### ప్రాపర్టీల సీజ్ పేరిట భయభ్రాంతులకు గురి చేస్తున్న అధికారులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ) : ఆస్తి పన్ను కట్టని వారిని జీహెచ్ఎంసీ లక్ష్యంగా చేసుకున్నది. పన్ను కట్టని వారి ఆస్తులను సీజ్ చేస్తామంటూ బెదిరిస్తున్నది. ఇందులో భాగంగానే ప్రతిరోజూ ఒక్కో సర్కిల్‌లో ఐదేసి చొప్పున ఆస్తులను సీజ్ చేస్తున్నది. వచ్చే నెలాఖరులో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న దరిమిలా జీహెచ్ఎంసీ ఆస్తిపన్ను వసూళ్లపై దూకుడు పెంచింది. చిన్నా, చితకా బకాయిదారుల నుంచి బడా వ్యక్తుల వరకు బకాయిదారుల చిట్టాను రూపొందించింది. సంస్థ ఖజానాను నింపుకోవడమే ఏకైక ఎజెండాగా కార్యాచరణను ప్రకటించింది.

### రెడ్ నోటీసులు జారీ

గత మూడు సంవత్సరాల పైబడి బకాయిలు పెండింగ్‌లో ఉండి పన్ను చెల్లించని వాళ్లకి వారెంట్స్ ఇష్యూ చేస్తున్నారు. ఇందులో భాగంగానే 6 లక్షల మంది బకాయిదారులకి రెడ్ నోటీసులు జారీ చేశారు. వీరి నుంచి రూ.400కోట్ల ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేశారు. నిర్ణీత గడువులోగా బకాయిలు చెల్లించాలని వారికి నోటీసులు ఇచ్చారు. నోటీసులకు స్పందించిన వారిపై రెవెన్యూ రికవరీ యాక్ట్ 269(2) కింద ఆస్తులను సీజ్ చేస్తున్నారు. ఈ మేరకు ఇప్పటి వరకు 80 ఆస్తులను సీజ్ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం బంజారాహిల్స్‌లోని తాజ్ బంజారా భవనాన్ని సీజ్ చేయగా.. సదరు యాజమాని స్పందించి శుక్రవారం ఆర్‌టీజీఎస్ ద్వారా జీహెచ్ఎంసీకి రూ. 51 లక్షల 50వేలను చెల్లించారు.

### రూ. 520 కోట్లే లక్ష్యం

ఆస్తిపన్ను బకాయిదారులపై కఠినంగా వ్యవహరించాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. 30 సర్కిళ్లలో బకాయిదారులను చిట్టాను సిద్ధం చేసి వారికి రెడ్ నోటీసులు జారీ చేసేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపింది. రోజురోజుకు సంస్థ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతుండడం, ఈ ఆర్థిక సంవత్సరం రూ.2000కోట్ల నిర్దేశిత లక్ష్యంలో ఇప్పటి వరకు కేవలం రూ.1480కోట్ల మేర పన్నులు రావడంతో బకాయిదారులపై స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని నిర్ణయించారు. 19.25 లక్షల మందిలో 12 లక్షల మంది మాత్రమే ఆస్తి పన్ను చెల్లించారని, దాదాపు 6.75 లక్షల మందిపై స్పెషల్ డ్రైవ్ చేపట్టి రూ.520 కోట్లు రాబట్టాలని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సూపర్‌వైజరీ ఆఫీసర్లు రోజూ వారీగా వసూలైన ఓటీఎస్ కలెక్షన్లను పీటీఐఎన్ నంబరు, వచ్చిన కలెక్షన్ల వివరాలను ఎప్పటికప్పుడు సమాచారం తీసుకోనున్నారు. ఆస్తిపన్ను చెల్లించాలని బకాయిదారులకు ఎస్ఎంఎస్‌లు పంపించనున్నారు.

### వారికి మాత్రం మొక్కుబడి నోటీసులు

జీహెచ్ఎంసీకి ఆస్తిపన్ను రూపంలో మొండి బకాయిలు మొత్తం దాదాపుగా రూ. 9800 కోట్ల మేర రావాల్సి ఉంది. ఇందులో అత్యధికంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలదే కీలకం. కేంద్ర ప్రభుత్వ సంస్థలైన 600 ఆస్తుల నుంచి రూ. 500 కోట్ల మేర బకాయిలు రావాల్సి ఉంది. ఇదే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు 4వేల ప్రాపర్టీల నుంచి రూ. 5000కోట్ల బకాయిలు జీహెచ్ఎంసీ ఖజానాను చేరాల్సి ఉంది. అయితే సాధారణ నగరవాసుల విషయంలో ప్రాపర్టీల సీజ్ వరకు వెళుతున్న అధికారులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బకాయిల రాబడిలో మాత్రం తూతూ మంత్రంగా నోటీసులతో సరిపెడుతున్నారన్న విమర్శలు లేకపోలేదు.